ప్రజాశక్తి

శనివారం 10 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

11న అమిత్ షాకు నిరసన సెగ

◆ సన్నద్ధమవుతున్న విశాఖ ప్రజానీకం

◆ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకుంటున్నట్లు ప్రకటించాల్సిందే : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

◆ కేంద్ర మంత్రి పర్యటనను అడ్డుకుంటాం : వామపక్షాలు

అమిత్ షా సభ ఏర్పాట్లును పరిశీలిస్తున్న పోలీసాధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్న సామెతను విశాఖ పర్యటనకు బిజెపి అగ్రనేత అమిత్ షా రానున్న తరుణాన ఈ ప్రాంత వాసులు గుర్తుచేసుకుంటున్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్, డిసిఐ, పోర్టు, ఎల్‌ఐసి ఆస్తులు, రైల్వే సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలపై కత్తిగట్టిన బిజెపి ఇక్కడ సభ పేరిట కాలుపెట్టే యత్నాలను ప్రజలంతా నిరసిస్తున్నారు. ఈ నెల 11న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా విశాఖ కార్మికవర్గం, ప్రజానీకం, వామపక్షాలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. 2014 నుంచి 2023 వరకూ బిజెపి పాలన అంతా ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేయడం, ప్రజల ఆర్థిక వనరులను కొల్లగొట్టి కార్పొరేట్లకు ఫణంగా పెట్టడమే పనిగా సాగడంతో అన్ని తరగతుల ప్రజానీకం తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం మిగతా 2లో..

అమిత్ షా పర్యటన ఇలా..

ఢిల్లీ నుంచి నేరుగా ఈ నెల 11 ఆదివారం సాయంత్రం 5 గంటలకు విశాఖకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేరుకుంటారు. రైల్వే గ్రౌండ్స్‌లో అప్పటికే బిజెపి శ్రేణులు సమీకరించిన జనంతో బహిరంగ సభ నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. సుమారు రాత్రి 7 గంటల వరకూ ఈ సభ జరుగనుంది. తొమ్మిదేళ్ల బిజెపి పాలన విజయోత్సవాలుగా ఈ సభకు పేరుపెట్టారు. ఎపిలో రాజకీయ శక్తిగా ఎదిగేందుకు అమిత్ షా రాష్ట్ర పర్యటన చేస్తున్నారంటూ.. ఆయనతో పాటు సిఎం రమేష్ హాజరవుతారంటూ బిజెపి నేతలు విశాఖలో శుక్రవారం ప్రకటించారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు విశాఖ పోర్టు గెస్ట్‌హౌస్‌లో విశాఖ జిల్లాకు చెందిన బిజెపి ముఖ్య నేతలతో అమిత్ షా సమావేశం అవ్వనున్నారు. 2024లో రాష్ట్రంలో జరుగనున్న ఎన్నికల నేపథ్యలో పొత్తుల వ్యవహారంపై పార్టీ శ్రేణులతో చర్చించే అవకాశం ఉంది.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు, పక్కన వామపక్ష పార్టీల నాయకులు

బిజెపి విద్రోహ పాలనపై

విశాఖలో నిరసన ర్యాలీ

వార్త మెయిన్‌లో..

బోగస్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థను నమ్మొద్దు

- 'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఈ నెల 7న 'ఉద్యోగాల పేరిట యువతకు గాలం' శీర్షికతో ప్రజాశక్తి టాబ్లాయిడ్‌లో హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌పై వచ్చిన కథనంపై రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ స్పందించారు. ఆ నకిలీ సంస్థను ఎవరూ నమ్మొద్దని ఆయన కోరారు. ఉద్యోగాల పేరిట వెలువడుతున్న ప్రకటనలు చూసి మోసపోవద్దని అన్నారు.

మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఎన్‌పిఆర్‌డి ఆందోళన

▶ వార్త 5లో..

ఉత్సాహంగా ముగిసిన గిరిజన సంఘం మహాసభ

▶ వార్త 8లో..

కొండెక్కిన కోడి - కిలో చికెన్ రూ.300

▶ వార్త 8లో..

ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్న సిబ్బంది

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను కలిగి ఉన్న దుకాణాలపై జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు దాడి చేశాయి. అపరాధ రుసుం వసూలు చేశాయి. నగర పరిధిలో ప్లాస్టిక్ అమ్మే దుకాణాలుపైనా, వాడే వర్తకులపైనా ఈ బృందాలు వేర్వేరుగా ఎనిమిది జోన్లలోనూ దాడులు నిర్వహించాయి. దుకాణదారుల నుంచి ప్లాస్టిక్ వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 58 దుకాణాదారుల నుంచి రూ.లక్షా 16 వేలా 300ను అపరాధ రుసుము కింద వసూలు చేశారు. 130.31 కిలోల ప్లాస్టిక్‌ను పట్టుకున్నట్టు అదనపు కమిషనర్ తెలిపారు. విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జివిఎంసి కమిషనర్ ఎంతో ప్రయత్నిస్తున్నారని అన్నారు. నగర పరిధిలో చిన్నా, పెద్ద దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్‌ను అమ్మడం, వాడకం చేసినట్లయితే అపరాధ రుసుంతో పాటు చర్యలూ ఉంటాయని హెచ్చరించారు.

వంచన

◆ ఉద్యోగులకు జగన్ సర్కారు మొండిచేయి

◆ ఒపిఎస్‌ను పునరుద్ధరించకుండా జిపిఎస్‌ను తెరపైకి తెచ్చిన వైనం

◆ వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

అధికారంలోకి వస్తే సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాట తప్పింది. సిపిఎస్ రద్దు చేస్తామని మాటిచ్చిన జగన్మోహన్‌రెడ్డికి నాడు మద్దతునిచ్చిన ఉద్యోగులను మోసగించింది. ఉద్యోగులంతా ఓల్డ్ పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తుండగా.. అందుకు భిన్నంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) స్థానంలో గ్యారింటీడ్ పెన్షన్ స్కీం (జిపిఎస్)ను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఒపిఎస్‌లో వున్న సౌలభ్యం జిపిఎస్‌లో ఉద్యోగులకు లభించదని చెబుతున్నా వినుకోవడంలేదు. సిపిఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి మూలవేతనంలో పది శాతం జిపిఎస్‌లో కూడా చెల్లించాల్సివుంది. ఒపిఎస్‌లో ఉద్యోగి సేవలకుగానూ ప్రభుత్వమే ఉద్యోగి చివరి మూల వేతనంలో 50 శాతాన్ని పెన్షన్ కింద చెల్లించేది. విశ్రాంత ఉద్యోగి చనిపోతే భార్యకు ఫ్యామిలీ పెన్షన్ కింద చెల్లించేది. ప్రభుత్వ ఉద్యోగి ఏ రకమైన చందా చెల్లించాల్సిన పనిలేదు. గ్రాట్యుటీ, డెత్ గ్రాట్యుటీ వంటి సదుపాయం ఒపిఎస్‌లో వుంది. ఈ పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలని ఉద్యోగులంతా ముక్తకంఠంతో కోరుతుంటే, అనేక షరతులతో కూడిన సిపిఎస్ స్థానంలో ప్రభుత్వం జిపిఎస్‌ను ముందుకుతేవడంతో ఉద్యోగులంతా ప్రభుత్వ చర్యలను తీవ్రంగా మిగతా 2లో..

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

సిపిఎస్ పథకంలో కొన్ని మార్పులు చేసి ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చిన జిపిఎస్‌లో కొత్తదనమేదీ లేదు. ఉద్యోగులకు భద్రతనిచ్చే పాత పెన్షన్ పథకం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలి. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించే దిశగా కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడుగులు వేస్తున్నట్లే సిఎం జగన్ ప్రభుత్వం కూడా వెంటనే సిపిఎస్ రద్దుకు చర్యలు తీసుకోవాలి. ఉద్యోగి తన వేతనంలో 10 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సిన అవసరంలేని ఒపిఎస్‌ను అమలుచేయాలి. జిపిఎస్ పథకంలో 'మినిమం పెన్షన్' గ్యారెంటీ అని, 33 శాతం పెన్షన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదు. అధికారంలోకి వస్తే సిపిఎస్‌ను రద్దు చేస్తానన్న మాటను సిఎం జగన్ నిలబెట్టుకోవాలి.

జి.చిన్నబ్బాయ్, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

మొదటి పేజీ తరువాయి..

11న అమిత్ షాకు నిరసన సెగ

చేస్తున్నారు. ముఖ్యంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయం, విశాఖకు రైల్వే జోన్ ఇస్తానని చెప్పి మోసగించిన వైనం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తికి మోకాలడ్డుతూ నిధులివ్వకుండా ఎండగడుతున్న తీరుపై విశాఖపట్నం, ఉత్తరాంధ్రకు చెందిన మేధావులు, వామపక్ష నేతలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలోనే సిపిఎం, సిపిఐ ఇతర వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఈ నెల 11 ఆదివారం విశాఖలో నిరసనలకు పిలుపునిచ్చారు. రైల్వే డిఆర్‌ఎం ఆఫీసు నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకూ వామపక్షాలు నిరసన తెలియజేసేందుకు ఇప్పటికే సిద్ధమయ్యాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోనూ దశల వారీ కార్యాచరణతో కార్మికులు కదులుతున్నారు. ఈ నెల 10న ప్లాంట్‌లోని వివిధ డిపార్టుమెంట్లలో కరపత్రాలు పంచుతూ ప్రైవేటీకరణ వ్యతిరేక ప్రచారం సాగిస్తారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించాలన్న డిమాండ్‌తో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, నిర్వాసితుల సంఘాలు నిరసన తెలపనున్నాయి. 11న కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వద్ద వేల మంది కార్మికులతో అమిత్ షా పర్యటనపై నిరసన హోరు వినిపించేందుకు రంగం సిద్ధమవుతోంది.

బిజెపి విద్రోహ పాలన ఇలా..

దేశంలో బిజెపి 2014లో అధికారంలోకి వచ్చే క్రమంలో ఏటా 2 కోట్లు ఉద్యోగాలిస్తామని, నల్ల డబ్బును బయటకు తీసి ప్రజల అకౌంట్లలో ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు చొప్పున వేస్తామని ప్రకటనలు గుప్పించింది. గెలుపు అనంతరం ఇవేవీ చేయకుండా కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల వరాలు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ), ఎయిర్ ఇండియాలను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్లకు కట్టబెట్టే విధానం తీసుకుంది. రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి, సిపిఎం, ఇతర వామపక్షాలు రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడుతున్నాయి. అయినప్పటికీ మోడీ సర్కారులో చలనం లేదు. ఇంకోవైపు ఇప్పటికే వాల్తేరు రైల్వే డివిజన్‌ను బిజెపి ప్రభుత్వం లేపేసింది. ఇస్తానన్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు మొండిచెయ్యి చూపుతూనే ఉంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు అమిత్ షా పర్యటనపై గుర్రుగా ఉన్నారు.

పర్యటనను జయప్రదం చేయండి : ఎంపీ సిఎం.రమేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలో అమిత్ షా పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ కార్యకర్తలంతా కృషి చేయాలని ఎంపీ సిఎం.రమేష్ అన్నారు. శుక్రవారం ఉదయం బిజెపి జిల్లా కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్.మాధవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ కాశీ విశ్వనాథ్‌రాజు పాల్గొన్నారు.

వంచన

వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం డిఎ పెంచినప్పుడల్లా ఒపిఎస్‌లో పెన్షన్ పెరుగుతుంది. సిపిఎస్, జిపిఎస్‌లో ఆ సౌలభ్యం లేదు. పిఆర్‌సి రివిజన్ చేసినప్పుడల్లా ఒపిఎస్‌లో పెన్షన్ పెరుగుతుంది. సిపిఎస్, జిపిఎస్‌లో ఈ పెరుగుదల ఉండదని ఉద్యోగులు చెబుతున్నారు. 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి సిపిఎస్ అమల్లోకి వచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యోగులకు ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సిపిఎస్ రద్దు కోసం నేడు ఆ ఉద్యోగులు ఎదురుచూస్తుంటే ప్రభుత్వం దానిస్థానంలో జిపిఎస్‌ను తీసుకురావడాన్ని అందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం దారుణం

జిపిఎస్ విధానాన్ని తీసుకు రావడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం దుర్మార్గం. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఒపిఎస్ అమలు చేయాలని ఉద్యమిస్తుంటే ఆ విషయాన్ని సిఎం పట్టించుకోవడం లేదు. ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి, కేంద్ర విధానాలకు అనుకూలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారు.

శీలా జగన్నాధరావు,
ఎపిటిఎఫ్ అధికార పత్రిక ఉపాధ్యాయ సంపాదకులు

వ్యతిరేకిస్తున్నాం

ఒపిఎస్‌తోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుంది. లోపభూయిష్టంగా సిపిఎస్‌ను అమలు చేసే కుట్రకు ప్రభుత్వం పాల్పడుతోంది. దశాబ్దాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు హరింపజేయ చూడడం విచారకరం. దీనివల్ల మాకు ఉన్న సౌకర్యాలను కోల్పోయే పరిస్థితి ఉంది. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

కొణతాల గోవిందరాజులు,
పిఆర్‌టియు జిల్లా కౌన్సిల్ సభ్యులు

మరో 194 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న 194 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ ప్రతిపాదనలను ఆమోదించినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. తన ఛాంబర్‌లో శుక్రవారం ఉదయం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ రెండో సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను మొదటి విడతగా 301 మంజూరు చేశామని, శుక్రవారం జరిగిన సమావేశంలో రెండో విడతగా 194 వెరసి 495 కార్డులను ఇప్పటి వరకు మంజూరు చేశామని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న, ఇప్పటి వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కమిటీ సభ్యులతో సమావేశమైన విశాఖ కలెక్టర్ మల్లికార్జున

నేడు జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

కెజిహెచ్ డౌన్‌లోగల డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్ సెంటరులో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఈ ఏడాది అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు 56 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారని చెప్పారు. వైద్య పరీక్షలు చేయించుకునే జర్నలిస్టులు డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్‌లో శనివారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రోజుకు 30 మందికి వైద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు, వి.మణిరామ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ అందజేత

స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న విక్రమ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆరో యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన బుగత చంద్రశేఖర్ (చంటి), పి.దేవకుమార్‌లకు వైసిపి యువజన విభాగం (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జ్ అవనాపు విక్రమ్ స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. ఇటీవల విశాఖ రైల్వే స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ బాక్సింగ్ చాంఫియన్ షిప్ డిఆర్‌ఎం కప్ పోటీల్లో చంద్రశేఖర్ హెవీ వెయిట్ (86-92) పోటీల్లో ప్రత్యర్థులను నాకౌట్ చేసి బంగారు పతకాన్ని సాధించారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన చంద్రశేఖర్ (చంటి) సిక్కిం రాష్ట్రంలో గ్యాంగ్‌టాక్ జిల్లాలో ఈ నెల 13 నుంచి 19 వరకు జరగబోయే నేషనల్ యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బాక్సింగ్ అసోసి యేషన్ ప్రతినిధులు డోల మన్మధకుమార్, సంపత్ రాజుల పర్యవేక్షణలో కోచ్ బి.ఈశ్వర్‌రావు శిక్షణలో జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్న వీరికి అవసరమైన పూర్తి స్థాయి స్పోర్ట్స్ కిట్‌ను విక్రమ్ అందించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. కార్యక్రమంలో ముని లక్ష్మణరావు, సంపత్ రాజు, ఎన్నింటి నరసింగరావు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో 16 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగాల్లో ఫిర్యాదుల పరిష్కారానికి జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ మార్గనిర్దేశకంలో శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన 'టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం' కార్యక్రమానికి 16 వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగం డిసిపిలు నరేంద్రనాథ్ రెడ్డి, కెఎస్.రత్నకుమార్, పద్మజ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపైనా, టౌన్ ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులున్నా టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని అధికారులు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖపట్నం : రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని నగర మేయర్ హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ఎంవిపి కాలనీ పరిధిలోని టిటిడి కల్యాణ మండపం నుంచి ఉషోదయ జంక్షన్ వరకు రూ.29 లక్షల వ్యయంతో తలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి జగదాంబ జోన్ పరిధిలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన చిన్నారులకు శుక్రవారం ఉదయం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బహుమతులు అందజేశారు. రొటేరియన్, ఇంటరాక్ట్ చైర్ మోదంబికా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి), రోటరీ కలిసి ఇంటరాక్ట్ క్లబ్ ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కొరెడ్ల రమాప్రభ, జోన్ కన్వీనర్ ఎల్లాజీ, జాహ్నవి, తులసీ, మణి, దుర్గ, అనురాధ, సరోజిని, నరేష్, శ్రీలక్ష్మి, జయంత్ పాల్గొన్నారు. జోన్ పరిధిలో ఉన్న కొబ్బరితోట, కల్లుపాకలు, కృష్ణ గార్డెన్, పందిమెట్ట, ఆంథోనీ నగర్, జగదాంబ ప్రాంతాల నుంచి చిన్నారులు హాజరయ్యారు.

చిన్నారులనుద్దేశించి మాట్లాడుతున్న నిర్వాహకులు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శుక్రవారం విశాఖలోని ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. 120 మంది కోస్ట్ గార్డ్ సిబ్బంది, వారి కుటుంబీకులు రక్తదానం చేశారు. ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE AT: BHEEMUNIPATNAM
O.S. 267/2022

Between:
Smt. Jampana Siva Kumari ...Plaintiff
And:
Sri Kothapalli Srinivas Chakravarthy ...Defendant

SUMMONS

To,
The Defendant :
Sri Kothapalli Srinivas Chakravarthy,
S/o. K. Satyannarayana,
R/at. D.No.608, B4,
Vaisakhi Skyline Apartments,
GITAM Medical College Road,
Yendada, Visakhapatnam-530045.

Take notice that the above suit is filed against you by the plaintiff in the above Court for recovery of amount on the strength of promissory note. As you are intentionally avoiding service of summons, the Hon'ble Court was pleased to order issuance of summons by way of paper publication. You are hereby summoned to appear before the above mentioned Court on **26-06-2023** at **10:30 A.M** in person or through an Advocate duly instructed to answer all the material questions relating to the above suit or else the matter will be heard and determined in your absence.

Y. CHINNAYYA DORA (YCD),
M/s. SARADHI & Y.Ch.Dora
Chambers of Law
Advocates
Visakhapatnam,
Cell: 9848763339.

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1283/2022

Between:
Canara Bank, Micro Finance Branch, Jagadamba Junction, Visakhapatnam, Rep. by its Authorized Officer ...Plaintiff
And:
Satya Devu Mahila Podupu Sangam & others ...Defendants

SUMMONS

To,
Defendant No.5:
Yamala Varalakshmi,
W/o. Murthy, Hindu,
aged about 52 years,
R/at D.No.19-32-1/2,
Ward No.23, Rangireeju Veedhi,
Visakhapatnam-01.

Please take notice that the above named Plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **28-06-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-06-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

K. NARASIMHA SAI,
Advocate
Ram Nagar,
Visakhapatnam.
Cell : 9885458030.

మిద్దె తోటలతో ప్రయోజనం

ప్రజాశక్తి -మధురవాడ : మిద్దె తోటల పెంపకం ద్వారా ప్రతి ఇంటినీ వ్యవసాయ క్షేత్రంగా మార్చి మంచి ప్రయోజనాలను పొందవచ్చు నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు . శుక్రవారం ఏడోవార్డులో, బైలర్స్ కాలనీలో జానుస్ నేచర్ మిద్దె తోటను సందర్శించారు. 60 గజాల మిద్దె మీద అనేక రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలను పెంచుతున్న ఝాన్సీని మేయర్ అభినందించారు..ఝాన్సీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, మిద్దెతోటల్లో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు,పండ్లను పండించుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు

అనంతరం జోన్ -2 కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచుతూ వాటి ద్వారా పండ్లు ,కూరగాయలను పండించడం శుభపరిణామన్నారు. ప్రతీ ఒక్కరూ బంగారు ఝాన్సీని ఆదర్శంగా తీసుకొని మిద్దె తోటలను సాగు చేసుకోవాలని సూచించారు . అనంతరం జానుస్ నేచర్ ఝాన్సీ మిద్దె తోట నిర్వహణలో తాను అవలంబిస్తున్న సేంద్రియ పద్ధతులను వివరించారు

.రసాయనిక అవశేషాలు లేని ఆకుకూరలు, కాయలు, పండ్లు పండిస్తూ తన కుటుంబ సభ్యులకు ఆరోగ్యం అందించడంతో పాటుగా సేంద్రియ వ్యవసాయం పట్ల అందరిని చైతన్యం చేస్తున్నాని అన్నారు.. తనను చూసి కొందరైన మిద్దె తోటలను సేంద్రియ విధానంలో పండిచుకొని ఆరోగ్యంగా జీవించాలని ఆశాభావం వ్యక్తం చేశారు..అనంతరం మేయర్ దంపతులు గొలగాని హరివెంకట కుమారి,శ్రీనివాసరావులను దుస్సాలువాతో సత్కరించి మిద్దె తోటలో కాసిన పండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బంగారు ప్రకాష్, వట్టికుల నాగమ్మ, పసుపులేటి గోపి, నూకవరపు బాబ్జి, బెల్లాన పాపారావు ,బట్టాన రాజు, ఇజ్జాడ సత్యన్నారాయణ, దత్తి వాసు, ఆర్పీలు తెంటు మాధవి, లావణ్య, రూప, 67వ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

మిద్దె తోటను పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

నేరాలు ఘోరాలు

బాలుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- పెందుర్తి: మండలంలోని ఎస్ఆర్.పురం గ్రామంలో ఐదేళ్ల బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు చెప్పిన వివరాలివి. పల్లా తేజ అనే బాలుడు గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని బాలుని తల్లిదండ్రులు పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని ఒక షెడ్డు వద్ద బాలుడు విగతజీవిగా కనిపించాడు. దీంతో అభం, శుభం తెలియని తన బిడ్డను అన్యాయంగా చంపేసారంటూ బాలుని తల్లి గగ్గోలు పెడుతూ రోదించడం పలువురికంట తడిపెట్టించింది. అందిన సమాచారం మేరకు పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుని మతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులను పట్టుకుంటామని సిఐ గొలగాని అప్పారావు తెలిపారు. లేకలేక పుట్టిన ఒక్కగానొక్క బిడ్డను పొట్టన పెట్టుకున్నవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మృతుడు పల్లా తేజ (ఫైల్)

బీమా తక్షణసాయం అందజేత

బీమా సాయం అందజేస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు శ్రీకాంత్‌నగర్, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న రామభక్త రఘు(45) గురువారం కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందారు. వైఎస్ఆర్ బీమా పథకంలో అతనికి సభ్యత్వం ఉండడంతో బీమా పరిహారం కింత తక్షణసాయంగా మంజూరైన రూ.పది వేలను మృతుని కుటుంబీకులకు వార్డు వైసిపి అధ్యక్షుడు కెల్ల సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రామకృష్ణ, వైసిపి నాయకులు పిల్లి వీర్రాజు, రాజు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి- సీతమ్మధార : మాతృభాషతోపాటు ఆంగ్ల పరిభాషలో పరిజ్ఞానం ఎంతో అవసరమని లెగ్జిగ్రాఫర్, వివిఎస్ తెలుగు ఇంగ్లీష్ డిక్షనరీ రచయిత సనవల జీవన్‌కుమార్ అన్నారు. తన్మయి క్రియేటివ్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పౌరగ్రంథాలయంలో రెండు రోజులుగా అమెరికన్ ఇంగ్లీష్ శైలిపై నిర్వహించిన ఉచిత శిక్షణ ముగింపులో మాట్లాడుతూ,అమెరికన్ ఇంగ్లీష్‌లో పరిజ్ఞానం భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా అమెరికన్ ఇంగ్లీష్ శైలి, వినియోగం, ఆంగ్లానికి, అమెరికన్ ఇంగ్లీష్‌కు సంబంధించిన కొన్ని పదాలు పలికి, సంభాషించడం, వాక్య నిర్మాణాలపై సోదాహరణంగా వివరించారు. సనాతన ధర్మం, మొండిఘటం, పెళ్లి చూపులు, కొబ్బరి బొండాం వంటి రోజువారీ వినియోగంలో ఉన్న పదాలు, వాటికి అనుబంధ పదాలను ఆంగ్ల వెర్షన్, కోమాలిమ్ వంటి ఆంగ్లపదాల రీతులు ప్రస్తావించి విశదీకరించారు. తన్మయి క్రియేటివ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, అక్షరసారధి బిఎస్ చంద్రశేఖర్ స్వాగత ఉపన్యాసం చేసిన కార్యక్రమంలో సీనియర్ క్రీడా జర్నలిస్టు, పర్వతారోహకులు నాగనబోయిన నాగేశ్వరరావు, తన్మయి క్రియేటివ్ కార్యదర్శి సిహెచ్‌వి. సత్యనారాయణ, కొణతాల రాజు మాట్లాడారు. కార్యక్రమానికి బాదంగీర్ సాయి సమన్వయకర్త గా వ్యవహరించారు.

సిఎం సహాయనిధి సాయం అందజేత

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎనిమిది మందికి వైద్యసాయం కింద మంజూరైన రూ.14.30లక్షల సాయాన్ని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకం కింద ఇప్పటికే ప్రభుత్వం, కార్పొరేట్ ఆసుపత్రుల్లో 2396 వ్యాధులకు ఉచిత వైద్యసేవలను వైసిపి ప్రభుత్వం అందిస్తోందన్నారు. జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, 14వ వార్డు కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, మహిళా విభాగం జోనల్ ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మి, సీనియర్ నేతలు మహదస్య గోపి, హరిపట్నాయక్, కె.చిన్నా, గణపతి పాల్గొన్నారు.

పౌరగ్రంథాలయంలో బాలికల కెరీర్ వింగ్

ప్రజాశక్తి- సీతమ్మధార : పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులు, నిరుద్యోగులకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అవసరమైన అన్ని పుస్తకాలు, రిఫరెన్స్ గ్రంథాలు అందుబాటులో ఉండడం అభినందనీయమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి. భాస్కరరామ్ అన్నారు. ఇటువంటి గ్రంథాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని, దీని అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు.

శుక్రవారం విశాఖ పోర్ట్‌సిటీ రోటరీ సభ్యులు పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు ఈ సందర్భంగా బాలికల కెరీర్ వింగ్‌ను ప్రారంభించారు అనంతరం మాట్లాడుతూ పౌరగ్రంథాలయంలో పరిస్థితులు విద్యార్థులు, పాఠకులు చదువుకోవడానికి ఎంతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. పోటీపరీక్షలకు కావాల్సిన గ్రంథాలు, డాక్యుమెంట్లు పౌరగ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, క్రమశిక్షణతో వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలోని విద్యార్థులతో మాట్లాడారు విశాఖ పోర్ట్‌సిటీ రోటరీ క్లబ్ సమకూర్చిన ఫర్నిచర్‌ను అందజేశారు గ్రంథాలయం కార్యదర్శి కార్యదర్శి డిఎస్ వర్మ, సభ్యులు ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ గ్రంథాలయ చరిత్రను ప్రగతిని వివరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు యు శర్మ, రొటేరియన్లు విశ్వనాథ్, గ్రంథాలయ అధ్యక్షులు విజయ కుమార్, సహ కార్యదర్శి డాక్టర్ డివి సూర్యారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి విశేష కృషి చేస్తోందని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె రాజు అన్నారు. శుక్రవారం 55వ వార్డులో రూ.37లక్షలతో 80ఫీట్ రోడ్ వాటర్ ట్యాంక్ నుంచి పరదేశమ్మ ఆలయం వరకు గెడ్డ, డ్రైనేజీ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ కెవిఎస్.శశికళ ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెం సాక్షి గణపతి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు కెపి రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, సీనియర్ నేతగా మహేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సంతోష్, వెంకటేష్, ధర్మేంద్రరెడ్డి, నాగలక్ష్మి, సూరెడ్డి, ఎఇ రమణమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : సత్య సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి శుక్రవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ప్రముఖ గాయకులు పిబి ఖాన్ నిర్వహణలో హుషారైన గీతాలు ఆలపించారు. నగర ప్రముఖులు సన్ మూర్తి, మహమ్మద్ ఖాన్, రాజేంద్రప్రసాద్, చెక్క రమాదేవి తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయకులు నరసింహమూర్తి పెమ్మరాజు, ఆర్‌వి ఆంజనేయులు, సాంబశివరావు, మెలోడీ సత్యనారాయణ, పిబి ఖాన్, మహమ్మద్ ఖాన్ నగరానికి చెందిన గాయనీమణులు భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, శైలజ ప్రేజ్, మాధురి, శ్రీదేవి, రాజరాజేశ్వరి, మను పల్ల, సుజాత తదితరులు పాత, కొత్త తరానికి చెందిన తెలుగు, హిందీ సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.కార్యక్రమంలో పలువురు సంగీత ప్రియులు పాల్గొని గాయనీ గాయకులను అభినందించారు.

బాధిత రైతులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేట నరసింహనగర్‌లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రమాద వశాత్తు రెండు గడ్డి వాములు దగ్ధమైన నేపథ్యంలో బాధిత రైతులు బాడితబోయి నరాంబాబు, గరికిన అప్పలరాజులకు వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శుక్రవారం చెరో రూ.5 వేలు సాయం చేశారు. దీనికి రైతులకు కృతజ్ఞతలు తెలిపారు

నేడు అయ్యప్ప స్వామి దేవాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామపంచాయతీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి ఈ నెల 10న, శనివారం ఉదయం 7గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు దేవాలయ పాలకవర్గం అధ్యక్షులు అనుమాలశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సౌకర్యాల లేమితో అప్పన్న భక్తుల అవస్థలు

ప్రజాశక్తి- సింహాచలం: అప్పన్న ఆలయానికి వచ్చే నిరుపేద భక్తులకు రాత్రివేళల్లో ఉచిత వసతి సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రయివేట్ లాడ్జిలలో, దేవస్థానం వసతి గృహాలలో అధిక మొత్తంలో గదుల అద్దెలు చెల్లించలేక రోడ్లపైనే రాత్రి వేళల్లో నిద్రిస్తున్నారు. కొందరు భక్తులు తెల్లవారుజామున సుప్రభాత సేవకు వెళ్లేందుకు సమాయత్తమయ్యే క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు సులభ కాంప్లెక్స్ తెరవకపోవడంతో స్నానానికి, ఇతర అవసరాలను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సుప్రభాతం సేవలో పాల్గొని అవకాశం కోల్పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. దేవస్థానం అధికారులు స్పందించి, తెల్లవారుజామున సులభ కాంప్లెక్స్ తెరిచి ఉంచేలా చర్యలు చేపట్టడంతోపాటు నిరుపేద భక్తులకు ఉచిత వసతి సౌకర్యాన్ని కల్పించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

రాత్రి వేళ ఆరుబయటే పడిగాపులు పడుతున్న భక్తులు

పచ్చిరొట్ట విత్తనాలతో లాభాలు

ప్రజాశక్తి -పద్మనాభం : పచ్చిరొట్ట విత్తనాలతో పంటలకు, భూమికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎంవి చలం అన్నారు. శుక్రవారం పద్మనాభం రైతుభరోసా కేంద్రంలో నిర్వహించిన తాలాడ సూరినాయుడు అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. పశువైద్యాధికారి కె.మహేష్‌కుమార్, తహశీల్దార్ తోట శ్రీవల్లి, ఎస్ఎంసి సభ్యులు అప్పలనాయుడు, పైడన్న, నారాయణరావు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బాలాజీ నగర్, భీమిలి మూడో వార్డు, తోటవీధికి చెందిన పలువురు యువకులు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ సమక్షంలో శుక్రవారం జనసేనలో చేరారు. స్థానిక పార్టీ నాయకులు నీలాపు శంకరరెడ్డి ఆధ్వర్యంలో తగరపువలసలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనుబాబు, పి భువనేశ్వరి, నానాజీ, అనిల్, శివ పాల్గొన్నారు.

12న రాష్ట్రపతితో ఆదిమ తెగ గిరిజనుల భేటీ

విశాఖ నుంచి ప్రత్యేక ఎసి రైలు భోగీలలో తరలిన 180 మంది పివిటిజిలు

ప్రజాశక్తి -మధురవాడ : భారత ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు ఈనెల 12న న్యూఢిల్లీలో ఆమెతో భేటీ అయ్యేందుకు విశాఖ నుంచి రాష్ట్రానికి చెందిన 180 మంది గిరిజనులు తరలివెళ్లారని గిరిజన సంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ మిషన్ డైరెక్టర్ ఈషా రవేంద్రబాబు తెలిపారు. రాష్ట్రపతితో భేటీకి దేశవ్యాప్తంగా 1500 మందిని ఎంపిక చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఐటిడిఏల నుండి 180 పివిటిజి గిరిజనులు ఉన్నారని తెలిపారు.

దేశంలో అభివృద్ధికి దూరంగా, అత్యంత దయనీయస్థితిలో జీవనం సాగిస్తున్న ఆదిమ జాతి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సమావేశానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ నుండి దొంగ్రియా బోడో, బోడో గదబ, గొట్టోబ్ గదబ, భోన్డ్ పోర్జ, కొండా రెడ్డి, కుట్టి బోన్డ్, పారంగి పోర్జ తదితర ఏడు తెగలకు చెందిన 120 మంది, పార్వతీపురం ఐటిడిఏ నుంచి బోడో గదబ, గొట్టోబ్ గదబ రెండు తెగలకు చెందిన 30 మంది, రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ నుండి కొండా రెడ్డి తెగకు చెందిన 18 మంది, సీతంపేట ఐటిడిఏ నుంచి కొండ సవర తెగకు చెందిన 10 మంది, కె ఆర్ పురం ఐటిడిఏ నుంచి కొండారెడ్డి తెగకు చెందిన ఇద్దరిని ఎంపిక చేశారన్నారు. వీరికోసం ఈనెల 9వ తేదీన అర్ధరాత్రి 12:25 గంటలకు విశాఖపట్నం నుండి న్యూఢిల్లీ వెళ్లే హీరాకుడ్ రైలు ఎక్స్‌ప్రెస్‌లో మూడు ప్రత్యేక అదనపు ఎసి బోగీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేశారని ఈషా రవీంద్రబాబు తెలిపారు.

రాష్ట్రపతితో భేటీకి ఢిల్లీ వెళుతున్న ఆదిమజాతి గిరిజనులు

11న విశాఖలో అమిత్‌షాకు నిరసన తెలపాలి

ప్రజాశక్తి - పెందుర్తి : విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఎపి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోన్న కేంద్ర ప్రభుత్వానికి తెలుగు ప్రజల వ్యతిరేకత తెలిపే క్రమంలో ఈ నెల 11న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విశాఖ పర్యటనను అడ్డుకుని నిరసన తెలపాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పెందుర్తిలో మీడియాతో మాట్లాడుతూ 36మంది బలిదానంతో విశాఖ ఉక్కుఆంధ్రుల హక్కు నినాదంతో పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా ప్రయివేటుకు కట్టబెట్టాలని చూడడం దుర్మార్గమని, ఈనెల 11న విశాఖ పర్యటనకు వస్తున్న అమిత్‌షాకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాలతో కలిసి నిరసన తెలియజేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

పిల్లల ఆశ్రమానికి ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం చేస్తున్న నర్సింగరావు

ప్రజాశక్తి- గాజువాక : సాహితీ కంప్యూటర్ అధినేత కరణంరెడ్డి నరసింగరావు, తన కుమార్తె సాహితీ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్ఫూర్తి నిరాధార పిల్లల ఆశ్రమానికి రూ.ఐదు వేలు ఆర్థికసాయం అందించారు. అనాథ పిల్లల మధ్యనే సాహితీ బర్త్‌డే కేక్ కట్ చేసి, వారికి పంపిణీ చేశారు. చాకెట్లనుఅందజేశారు. కార్యక్రమంలో జ్యోతి, కమల, చిరు పాల్గొన్నారు..

ఉపాధి నిధులతో వరద కట్ట పనులు

ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని టి నగరపాలెంలో రూ.6.80లక్షల ఉపాధి హామీ నిధులతో దివీస్ వాటర్ ట్యాంకు నుంచి శ్మశానవాటిక వరకు వరద కట్ట నిర్మాణ పనులకు శుక్రవారం సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపిటిసి పల్లా నీలిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరద కట్ట నిర్మాణం ద్వారా సుమారు 110 మంది కూలీలకు ఉపాధి లభించనుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పి మురళి ,వైసిపి నాయకులు చంద్రశేఖర్, సన్యాసిరావు పాల్గొన్నారు

బదిలీ పోలీసులకు అభినందన

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం పోలీస్‌స్టేషన్ నుంచి 13మంది పోలీసులు బదిలీ కాగా, శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వీరందరికీ వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఎన్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పలువురు మాట్లాడుతూ, కొత్త పోలీస్‌స్టేషన్‌లోనూ ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కాగా పద్మనాభం పోలీస్‌స్టేషన్ నుంచి 11మంది సివిల్, ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు బదిలీకాగా, ఇక్కడకు తొమ్మిది మంది సివిల్, ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు వస్తున్నారని సిఐ సన్యాసినాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నక్కా శ్రీను, స్పెషల్ బ్రాంచి పోలీసు రాము పాల్గొన్నారు.

19 నుంచి నిరవధిక సమ్మె

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్

సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి- పిఎం పాలెం : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలు అమలులో నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల19 నుంచి మున్సిపల్ కార్మికులంతా నిరవధిక సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రెండో జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ శేషు బాబు, ఎస్ రామప్పడు డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి రెండో జోన్ కార్యాలయం, అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది సమ్మె సమయంలో చేసుకున్న ఒప్పందాలు, ఇచ్చిన హామీల అమలులోనూ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. మరణించిన కార్మికుల వారసులకు, వయసు పైబడిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 300మంది కొత్త కార్మికులను నియమించిగా, వారి నుంచి రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. యుజిడి, వాటర్‌సప్లయ్, మలేరియా కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి సౌకర్యాలను కల్పించాలన్నారు. తక్షణమే కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి, న్యాయమైన పరిష్కారం చూపడం ద్వారా సమ్మె జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కార్యకర్తలు కె.నాగరాజు, బి నర్సింగరావు,కె.సురేష్, కె.శ్రీను, పి రామారావు, బి ఆదిలక్ష్మి, సిఐటియు మధురవాడ జోన్ ఉపాధ్యక్షులు డి అప్పలరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

క్రీడాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : జాతీయస్థాయి క్రీడల్లో బంగారు పతకాలను సాధించిన గాజువాక క్రీడాకారులు ఆండిబోయిన లక్ష్మి, ఆండిబోయిన అప్పారావులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సత్కరించారు. జాతీయ స్థాయి క్రీడల్లో గాజువాక కీర్తిపతకాన్ని ఎగరేసిన క్రీడాకారులను అభినందిస్తూ, భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి రజక డైరెక్టర్ యువశ్రీ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెంపటి అప్పారావు, రంభ నారాయణమూర్తి, మంత్రి శంకర్ నారాయణ, చిత్రాడ వెంకటరమణ, గొందేశి సత్యారావు, గొరుసు సత్యంరెడ్డి, పిట్ట రెడ్డి, వాసు అప్పల రెడ్డి, గొందేశి అప్పల రెడ్డి, తోకాడ అప్పారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పార్కులో ఔషధ మొక్కల నాటివేత

మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -పిఎం పాలెం: ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చే సందర్శకుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని పిఎం పాలెం ఫ్రెండ్స్ వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పి ఎం పాలెం తులసినగర్ జివిఎంసి వాకర్స్ పార్కులో ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ ఐజాక్, అటవీ శాఖ అధికారి నటరాజ్ పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి మాట్లాడుతూ క్లబ్ ద్వారా గతంలో పలు సేవా కార్యక్రమాలు చేశామని, ఇప్పుడు నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా స్వీకరించామన్నారు. ప్రతి ఇంటిలో ఒక పచ్చని మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసన్నకుమారి కోశాధికారి భ్రమరాంబ, ఉపాధ్యక్షురాలు జ్యోతి కమల, రాధా రాణి, క్లబ్ సభ్యులు విజయలక్ష్మి, చిన్నారి, సత్యవతి, విజయ, అపర్ణ, నికిత, రోజా పాల్గొన్నారు.

వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు మరింతగా మెరుగు పరచాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అత్యవసర మందులు, లాబ్ కిట్లు, ఇసిజి రోల్స్, శస్త్రచికిత్సకు అవసరమయ్యే పరికరాలు, ఫింగర్ పల్స్ ఆక్సీమీటర్ కొనుగోలుకు సమావేశంలో నిర్ణయించారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేపట్టేందుకు, ఆక్సిజన్ సిలెండర్లు ఫిల్లింగ్, రవాణా చార్జీలు, దోమల బెడద లేకుండా వార్డుల్లో కిటికీలకు మెస్‌ల అమరిక, ఫ్యాన్లు, లైట్లు, కొత్త ఆపరేషన్ థియేటర్ ట్విన్ డన్ లైట్ కొనుగోలుకు సమావేశం ఆమోదం తెలిపింది. ఎక్స్‌రే మిషన్ మరమ్మతులకు నిర్ణయించారు. సమావేశంలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి ఎం ఫణికుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు వై అచ్చిబాబు, మంగతాయారు, డి నాగమణి, ఎంపిడిఒ వెంకటరమణ, జెడిసి బొడ్డేపల్లి రాము, మాజీ కౌన్సిలర్లు కె ఎల్లాజీ, ఎం లక్ష్మణరావు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గంభీరంలో వెల్నెస్ సెంటర్ ప్రారంభం

ఆనందపురం : మండలంలోని గంభీరంలో వెల్నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, గంభీరం పంచాయతీలో ఇప్పటివరకు రూ.16కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సమస్యలేవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బంక సత్యం, వైస్ ఎంపిపిలు పాండురంగ శ్రీను, బట్న ధనలక్ష్మి రామకృష్ణ , జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్ది వెంకటరావు, మండల ఉపాధ్యక్షులు కోరాడ ముసలి నాయుడు, ఎఒ రత్నప్రభ, డాక్టర్ శైలజ పాల్గొన్నారు

మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఎన్‌పిఆర్‌డి ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లి

దేశ రాజధాని ఢిల్లీలో మహిళా రెజ్లర్లుచ చేస్తున్న నిరసన దీక్షలకు మద్దతుగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా విభాగం నాయకురాలు బుద్ధ ధనలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీలలో మన దేశానికి పేరు ప్రఖ్యాతులు, ఎన్నో బంగారు పతకాలు సాధించిన వారిపై లైంగిక దాడులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి బాధ్యులైన బిజెపి ఎంపీ, డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు మాట్లాడుతూ మహిళా క్రీడామణులు న్యాయం కోసం సుమారు నెల రోజులుగా రాజధానిలో పోరాడుతున్నారని, దోషులను శిక్షించడానికి బదులు శాంతియుత నిరసన ప్రదర్శన చేసిన బాధితులపై ఢిల్లీలో ఘోరంగా దాడి చేయడం అమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆడారి అన్నపూర్ణ, కే రామలక్ష్మి, బండా లక్ష్మి, సన్యాసమ్మ, రాపేటి భాస్కరరావు, పెట్ల సన్యాసిరావు, హాసిని తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా ధర్నా చేస్తున్న వికలాంగులు

అరుణను అభినందిస్తున్న మళ్ల సురేంద్ర

చెస్ బాక్సింగ్ పోటీల్లో అరుణకు బంగారు పతకం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈ నెల 4 నుండి 7వ తేదీ వరకు కలకత్తా సర్కిల్ క్లబ్లో జరిగిన ఏషియన్ చెస్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్, ఇండియన్ ఓపెన్ చెస్ బాక్సింగ్ వరల్డ్ కప్ వెయిట్ కేటగిరి (58 నుంచి 62కిలోల విభాగంలో) జరిగిన పోటీలలో అనకాపల్లి మండలం మారేడుపూడి తారకరామ కాలనీ చెందిన కోరుకొండ అరుణ గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆమె అనకాపల్లికి విచ్చేసిన నేపథ్యంలో అనకాపల్లి జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షులు మళ్ల సురేంద్ర స్వగృహంలో అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా మళ్ల సురేంద్ర మాట్లాడుతూ బాక్సింగ్ రంగంలో ముందు ముందు ఎన్నో విజయాలు సాధించాలని, అనకాపల్లికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన విలేకరికి పైలా ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కె కోటపాడు : కె.కోటపాడు గ్రామానికి చెందిన విలేకరి నేమ్మల సతీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలుకు ఫ్రాక్చర్ కావడంతో విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో సర్జరీ చేసుకొని చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాద్ రావు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

డైట్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మేగజైన్‌ను మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రరెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ మ్యాగజైన్‌లో కళాశాల సాధించిన ప్రగతి, విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, కళాశాలలో నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్ని రంగాలలో విద్యార్థులు సాధించిన అవార్డ్స్, రివార్డ్స్ పొందుపర్చారు. ఈ సందర్భంగా హేమచంద్ర రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మానవ వనరుల శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో డైట్ 150 - 300 బ్యాండ్ ర్యాంకులో నిలిచినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల డైట్ నేక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) 3.11 స్కోర్ తో 'ఎ ' గ్రేడ్ సాధించడం గర్వకారణమన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు ధీటుగా ఉన్నత ప్రమాణాలతో కళాశాలను నడుపుతున్న దాడి రత్నాకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమములో ఏపి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డి వరప్రసాద్ రెడ్డి, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, గంగిరెడ్డి, కోటేశ్వరరావు, శాంతిరాం మెడికల్ కాలేజీ చైర్మన్ శాంతి రాముడు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ తదితరులు

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి వెంకటపద్మలక్ష్మి తదితరులు

ప్రజాశక్తి - పరవాడ

రైతులు నాణ్యమైన విత్తనాలు వాడి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం మండల వ్యవసాయాధికారి సిహెచ్ చంద్రావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వరి విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా రాయితీ విత్తనాలు పొందాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి చంద్రావతి మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు వరి విత్తనాలు బిపిటి-5204 (సాంబమసూరి) రకం 80 క్వింటాళ్లు, ఆర్‌జిఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) 80 క్వింటాళ్లు, ఎంటియు-1224 (మార్టేరు సాంబ) 5 క్వింటాళ్ళు, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోన) 2 క్వింటాళ్ళు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ వరి విత్తనాలపై కేజీకి పది రూపాయలు రాయితీ వర్తిస్తుందని, కావలసిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూన అప్పలరాజు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బండారు రాజశేఖర్, వైసిపి నాయకులు చుక్కా రామునాయుడు, వెన్నెల సన్యాసిరావు, వ్యవసాయ విస్తరణాధికారులు పి.సంజీవరావు, ఎంఎన్.మూర్తి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని వంగలి గ్రామంలో డ్రగ్స్ నిర్మూలన శాంతి కమిటీ సభ్యుల సహకారంతో గంజాయి, మత్తు పదార్థాల నిషేధంపై అవగాహన సదస్సును స్థానిక సిఐ పి.రంగనాథం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సరిహద్దు మారుమూల ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి గాని, మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించిన, రవాణా చేసినా తమకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం చట్టవ్యతిరేకమైనదని, వాటి జోలికెళ్లొద్దని హితవుపలికారు. ట్రాఫిక్ నిబంధనలు, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ రంగనాథం

తహశీల్దార్‌గా కనకారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండల నూతన తహశీల్దార్‌గా పి.కనకారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనతో పాటు నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా డి.శాంతిభూషణరావు కూడా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ పి.కనకారావు ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల ప్రజలకు, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు లాంటివి అంతరాయం కలగకుండా మండల పరిధిలో ఉన్న వారికి పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి సంబంధిత పత్రాలను మంజూరు చేస్తామని తెలిపారు. విఆర్ఓలు, ఆర్ఐలతో మండల సమావేశం ఏర్పాటు చేసి మండలంలో ఉన్న స్థితిగతులు, పరిస్థితులను అధ్యయనం చేసి ప్రజలకు మెరుగైన రెవిన్యూ ఇతర సేవలను అందిస్తామని పేర్కొన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా భూకబ్జాలు జరిగిన, తమ దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేలు జరిమానా

ప్రజాశక్తి- పరవాడ : మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.10వేలు జరిమానా లేదా వారం రోజులు జైలు శిక్ష విధించబడుతుందని పరవాడ సిఐ పి.ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి తమ వాహనం సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచించారు. తమ వెంట వాహనాలకు సంబంధించిన వివిధ పత్రాలను అందుబాటులో ఉంచాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వరి సాగులో కొత్త వంగడాలు, తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : కొన్నెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం వరి సాగులో కొత్త వంగడాలు, తెగుళ్లపై రైతులకు మల్టీ లోకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన శాస్త్రవేత్త కోఆర్డినేటర్ రాజకుమార్ అవగాహన కల్పించారు. వేసవి దుక్కులు వల్ల ఉపయోగాలను వివరించారు. రైతుల భూసార పరీక్షలను చేసుకోవడం ద్వారా ఎంతగానో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.బాబు, స్రవంతి, జిల్లా మేనేజర్ తిరుమల్ రావు, ప్రోగ్రామ్ సపోర్టర్ జి వెంకట రామ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలకు ఆసరా సొమ్ము జమపై ఫిర్యాదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కొన్ని వాణిజ్య బ్యాంకులు డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణమాఫీగా జమ చేసిన ఆసరా నగదును బకాయిల కింద జమ చేసుకుంటున్నారని జిల్లా పేద ప్రజల హక్కుల సమితి అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు శుక్రవారం చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీకి ఫిర్యాదు చేశారు. మండలంలోని 1297 డ్వాక్రా గ్రూపులకు ప్రభుత్వం రూ.7.67కోట్లు నగదును జమ చేసిందని తెలిపారు. మండలంలో కొన్ని వాణిజ్య బ్యాంకులతోపాటు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ బుచ్చయ్యపేట వారు డ్వాక్రా సంఘాల సభ్యులు బాకీలను జమ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయమే స్థానిక ఎంపీడీవో ద్వారా బ్యాంకులకు ఆసరా నగదును జమ చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సిసి డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామం గవరపేట వీధి కొబ్బరి తోట వైఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద సుమారుగా రూ.6 లక్షలతో సిసి డ్రైనేజీ నిర్మాణ పనులకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్‌తో కలిసి సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీలు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, దంతులూరి కళ్యాణ్ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, బిఎస్ఎన్ఎల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, రైతు నాయకులు పీలాబుజ్జి , వార్డ్ మెంబర్లు వెలగా మోదు నాయుడు, రవ్వ శ్రీను, మాది బోయిన నాగరాజు, తర్రా సత్యారావు, యన్నం శెట్టి రామారావు, కొణతాల అర్జున్ నాయుడు, లహరి, పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న పెంటయ్యనాయుడు, దిలీప్ కుమార్

చేనేత కార్మికుల జీవనం దుర్భరం

రుణం అందజేస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు రామ్మోహన్‌రావు

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా పిఎసిఎస్

ప్రజాశక్తి- మునగపాక రూరల్

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని మునగపాక ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్రావు అన్నారు. స్థానిక సహకార సంఘంలో శుక్రవారం వ్యవసాయేతర రుణాలకు సంబంధించిన ఆరు లక్షల రూపాయల చెక్కును లబ్ధిదారులకు సంఘం డైరెక్టర్ కొయ్య చక్రంతో కలిపి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ రుణాలను పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈవో ఆడారి వేణుగోపాలకృష్ణ, బొడ్డేడ లిల్లీ పాల్గొన్నారు.

ఆకతాయిలపై కఠిన చర్యలకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అర్ధరాత్రులు వీధిలైట్లను ఆర్పేస్తున్న ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్పి దివాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు వీధుల్లో ఆకతాయిలు వీధిలైట్లను ఆర్పి వేయడం, చితకొట్టడం చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీంతో వీధుల్లో వెళ్లేందుకు మహిళలు భయభ్రాంతులకు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆకతాయిలపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, పిట్ట సూర్యారావు పాల్గొన్నారు.

నూతన హెచ్ఎంకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బదిలీపై వచ్చిన శంకర్రావును గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చేతుల మీదుగా హెచ్ఎం శంకర్రావును సాలువతో సత్కరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ తుమ్మపాల హైస్కూల్ పిల్లలను సక్రమంగా చదివేటట్లు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా శంకరరావు కొండకర్ల హైస్కూల్లో హెచ్ఎంగా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చదరం చిన్న, హైస్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, చిన్న, వార్డ్ మెంబర్లు తర్రా సత్యా రావు, రవ్వ శ్రీను, అగ్రికల్చర్ అసిస్టెంట్ మనీషా, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని మెలుపాక దళితవాడలో మంచినీటి బోరును గ్రామ సర్పంచ్ భాస్కర్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా భూగర్భ జలాల మార్పుతో మంచి నీరు ఎరుపు రంగులో రావటం వలన ప్రజల ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను శాసనసభ్యులు కన్నబాబురాజు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆయన చొరవతో నూతన మంచినీరు బోరు వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గుబ్బల ఆనంద్, గుళ్ళ పైడియ్య, స్కూల్ కమిటీ చైర్మన్ కుర్రయి నాగరాజు, నాయకులు గుంట్ల శ్రీను, నక్కపల్లి వెంకట్ ప్రసాద్, గొంది రాము, కాకర సూర్యనారాయణ, అయినెల్లి అచ్చియ్యనాయుడు, గుబ్బల వెంకటేశులు, ఎనుగుపల్లి చిన్నారావు పాల్గొన్నారు.

విద్యుత్తు కోతతో గ్రామాల్లో అంధకారం

ప్రజాశక్తి అచ్యుతాపురం : తరచూ విద్యుత్ కోతతో మండల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పగలంతా ఎండ తాపానికి గురవుతున్నారు. ఉక్కపోత వృద్ధులు చిన్న పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. సాయంత్రం అయ్యేసరికి విద్యుత్ కోత విధించడతో గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయి. ఫ్యాన్లు తిరగక ఉక్క పోతతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అచ్యుతాపురం మండలంలో చీకటి రాజ్యం ఏలుతుంది.

- అమలు కాని ఉచిత విద్యుత్
- అందరికీ అందని నేతన్న నేస్తం
- వలసలు పోతున్న వైనం

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలంలో చేనేత కార్మికులు దుర్భర జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలు అమలుకాక, చేస్తున్న పని గిట్టుబాటు కాక పనుల కోసం వలసలు పోతున్నారు. కుల వృత్తిని వదులుకోలేని కొంత మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని బంగారయ్యపేటలో శ్రీసాంబమూర్తి చేనేత సహకార సంఘంలో 110 కుటుంబాలు సభ్యులుగా ఉన్నాయి. ఒక మగ్గం మీద బట్టలు నేయాలంటే నలుగురు పని చేయాల్సి ఉంటుంది. ఎవరైతే నేత నేస్తారో వారికి 100 యునిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇది పలు జిల్లాల్లో అమలు జరుగుతుంది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం ఎం.భూపాలపట్నంలోనూ, శ్రీకాకుళం జిల్లాలోనూ 100 యూనిట్ లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. కాని కశింకోట మండలం బంగారయ్యపేటలో మాత్రం ఉచిత విద్యుత్ అమలు కావడం లేదు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అమలు చేయడానికి చర్యలు తీసుకోలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పెట్టుబడి పెరిగి గిట్టుబాటుకాక అనేక మంది నేత కార్మికులు హైదరాబాద్, అనకాపల్లి, గాజువాక తదితర ప్రాంతాల్లో బట్టల షాపులు, కంపెనీల్లో పనుల కోసం వలస పోయారు.

దీంతో ప్రస్తుతం ఈ గ్రామంలో సుమారు 40 కుటుంబాలు చేనేత వస్త్రాలు నేస్తూ జీవనం సాగిస్తున్నాయి. అయితే వైసిపి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇస్తున్న నేతన్న నేస్తం ఆర్థిక సాయం 14 కుటుంబాలకు మాత్రమే ఇచ్చింది. చిన్న చిన్న కారణాలు చూపించి మిగిలిన కుటుంబాల వారికి నేతన్న నేస్తం వర్తింపజేయడం లేదు. దీంతో చేనేత కార్మికుల కుటుంబ జీవనం కష్టతరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారుల స్పందించి ఉచిత విద్యుత్ అమలు చేయాలని, నేతన్న నేస్తం అందరికీ ఇవ్వాలని, రుణాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

రాట్నంపై నూలు వడుకుతున్న అల్లంక పాపాలు

మగ్గంపై బట్టలు నేస్తున్న ఆంద్ర శ్రీనివాసరావు

అందరికీ నేతన్న నేస్తం ఆర్థిక సాయం ఇవ్వాలి

చేనేత నేస్తున్న కార్మికులందరికీ నేతన్న నేస్తం డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అందరికీ నేతన్న నేస్తం ఆర్థిక సాయం అందించాలి

- ఆంద్ర శ్రీనివాసరావు, చేనేత కార్మికుడు, బంగారయ్య పేట

విన్నవించినా ఉచిత విద్యుత్ అమలు కావడం లేదు

రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు జరుగుతుంది. కాని మా సొసైటీ సభ్యులకు అమలు చేయడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వాలి చేనేత జౌళి శాఖ అధికారి వినతిపత్రం సమర్పించాం. అయినా ఇంకా అమలు కాలేదు. ఇప్పటికైన అమలుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- అల్లంక పాపాలు (పార్వతి) చేనేత కార్మికురాలు, బంగారయ్య పేట

వలసలు పోతున్నారు

చేనేత గిట్టుబాటు కాక కార్మికుల కుటుంబ జీవనం సాగడం లేదు. దీంతో హైదరాబాద్, గాజువాక ప్రాంతాలకు వలసలు పోతున్నారు.

- దేశెట్టి నాగేశ్వరరావు, శ్రీ సాంబమూర్తి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బంగారయ్య పేట

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కిరణ కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా పైడివాడ అగ్రహారంలో జగనన్న లేఔట్‌ను, అమృతపురంలో నాడు-నేడు కింద పాఠశాలలో చేస్తున్న పనులను పరిశీలించారు. బాటజంగాల పాలెంలో ఉపాధి హామీ పథకం పనులలో అమృత్ సరోవర్ ప్రాజెక్ట్ కింద జరిగిన చెరువు పనులను సందర్శించారు. సబ్బవరం పిహెచ్‌సి, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ షేక్ బాబురావు, ఎంఇఒ ఎస్.అప్పలరాజు, హౌసింగ్ డిఈ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కశింకోట : గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రోజారాణి అన్నారు మండలంలోని ఉగ్గినపాలెం గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఇళ్ల నిర్మాణం, అంగన్వాడీ, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రవికుమార్, సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఎపిఒ శివ, మండల సమాఖ్య ఎపిఎం శ్రీనివాసరావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి రోజారాణి

భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- చోడవరం : సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించడంతో భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని శ్రీరామపట్నం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు అమలు కాని హామీలు గుప్పిస్తున్నాయని వాటిని నమ్మరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవ సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, అంకుపాలెం సర్పంచ్ నాగులపల్లి రాంబాబు, పిఈఆర్‌డిఈ ప్రసాద్, ఇన్చార్జ్ ఎంపీడీవో చైతన్య, వైసిపి నాయకులు బొట్టేటి సూర్యనారాయణ, సానాపతి శ్రీనివాసరావు పళ్ళ నర్సింగరావు పాల్గొన్నారు.

టిడిపి విధానాలను ప్రచారం చేయాలి

ప్రజాశక్తి అచ్యుతాపురం : తెలుగుదేశం పార్టీ విధానాలను ప్రజలకు తెలియజేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం అచ్యుతాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ విధానాన్ని యన్‌టిఆర్ ప్రవేశపెట్టారని చెప్పారు. పార్టీ విజయానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలు పెట్టి వాటి నుండి పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేటాయించాలని కోరారు. నాయకులు దూలి రంగనాయకులు, భీమరశెట్టి శ్రీనివాసరావు, జనపరెడ్డి నర్సింగరావు, దొడ్డి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని నాయుడుపాలెం, ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ పరిధిలో హనుమాన్ నగర్ వద్ద అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి దళాయిపాలెం బురదపేట గ్రామానికి చెందిన కీర్తిశేషులు బురద అప్పారావు కుమారుడు లంకెలపాలెం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ బురద అప్పలరాజు శుక్రవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు బురద అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, ఈరుగుల లక్ష్మీప్రసాద్, ఒలిశెట్టి అప్పలరాజు, కిలపర్తి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దారును కలిసిన ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట నూతన తహశీల్దార్‌గా వచ్చిన వెంకటేశ్వరరావును బుచ్చయ్యపేట మండలం ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు దేవర అప్పారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన తహశీల్దార్ వెంకటేశ్వరరావును సాలువాతో సత్కరించి అభినందించారు. మండలంలో రీ సర్వే పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేపి అగ్రహారం గ్రామ సచివాలయ కన్వీనర్ అడ్డూరు శ్రీనివాసరావు, స్థానిక పాల సంఘం అధ్యక్షులు తూరబిల్లి కాసు, వార్డు సభ్యులు గంగారపు రమణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారును కలిసిన దేవర అప్పారావు తదితరులు

విఆర్‌పిపై విచారణ ఇలాగేనా

బుచ్చంపేట గ్రామస్తులు, కూలీల ఆగ్రహం

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని గ్రామ ప్రజలు అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో భాగంగా శుక్రవారం బుచ్చంపేట గ్రామం సచివాలయంలో అధికారులతో విచారణ చేపట్టారు. అధికారులు విచారణ చేయకపోగా గ్రామస్తులు చెప్పిన విషయాన్ని సైతం వినకుండా విఆర్‌పికి అనుకూలంగా ఉండటంపై గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి అధికారులు జారుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కూలీలు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథంలో పనులకు రాని వాళ్లకు కూడా ఆరు రోజులు పని దినాల కింద వారికి స్కేల్ ఇస్తున్నారని తెలిపారు. ఆరు రోజులు పూర్తిగా పని చేసిన వారికి మూడు రోజులు మినహాయించి మూడు రోజులు కూలి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. ఉపాధి హామీ వీఆర్పీ పది సంవత్సరాలుగా ఉంటుందని, ఆమె ఆగడాలకు అడ్డు అదుపు లేదని అన్నారు. ప్రశ్నిస్తున్న వారికి మాస్టర్లు తగ్గించి టెక్నికల్ ప్రాబ్లమ్ అని ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు తెలిపారు.జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని వారు కోరారు.

విచారణ చేపడుతున్న అధికారి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అర్హులకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-నక్కపల్లి:అర్హులందరికీ అనేక సంక్షేమ పథకాలు అందించినట్లు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. మండలంలోని చినతీనార్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించారు.గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైసిపి నాయకులు వీసం నానాజీ, శీరం నరసింహ మూర్తి, ఎలమంచిలి తాతబాబు, సూరకాసుల గోవింద్ పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా సత్యవతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని రావణాపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. టీడీపీ మద్దతుతో గెలుపొందిన వార్డు సభ్యురాలిని ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్ అప్పలనాయుడు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అనంతరం ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో అతని భార్య సత్యవతి నాలుగో వార్డు సభ్యురాలిగా ఎన్నికయ్యారు. తాజాగా ఉప సర్పంచ్ స్థానానికి గ్రామ సచివాలయంలో ఎన్నిక జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ మద్దతుతో గెలుపొందిన వార్డు సభ్యులంతా కలిసి రాజాన సత్యవతిని ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నర్సీపట్నం డివిజన్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎన్.మూర్తి వ్యవహరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉద్దండ పురంలో లో శుక్రవారం సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, పార్టీ అధ్యక్షులు పాపారావు, నాయకులు నానాజీ, నరసింహ మూర్తి, సూర కాసుల గోవింద్, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

40 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట పిహెచ్‌సిలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గర్భిణీలకు వైద్యాధికారి హరిప్రవీణ్ ఆధ్వర్యంలో 40 మంది గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణీలకు రక్తహీనతను అధిగమించే విధానాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకుంటూ తప్పకుండా వైద్య పరీక్షల్లో నిర్వహించు కోవాలన్నారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

ఉపాధికి నిధులు పెంచాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి:పేదలను ఆదుకుంటున్న ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయింపులు పెంచాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఉపమాక గ్రామంలో ఉపాధి పని ప్రదేశంలో శుక్రవారం ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, వ్యవసాయ పనులు లేని ఇటువంటి సమయంలో వ్యవసాయ కూలీలను ఆదుకుంటున్న చట్టానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు కూడా బాగా తగ్గాయని, ప్రస్తుతం జాబ్ కార్డుకు కేవలం 100 రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారని ఇవి కూలీలకు సరిపోలేదన్నారు. దీంతో పనులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 200 రోజులు పని కల్పించాలని కోరారు.వేసవి అలవెన్సులు, పనిముట్లకు అదనంగా డబ్బులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.నానాజీ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- కోటవురట్ల:రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా శుక్రవారం పలు శాఖల అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా వి.కాశీవిశ్వనాథం, మండల వ్యవసాయ శాఖ అధికారినిగా సరోజిని బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలంలో ఈఓఆర్డీగా పని చేశారు. అక్కడ నుండి పదోన్నతి ఇక్కడికి వచ్చారు. మండల వ్యవసాయ అధికారి సరోజినీ హుకుంపేట మండలం నుండి బదిలీపై వచ్చారు. ఇంతకాలం నక్కపల్లి వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ విధులు నిర్వహించేవారు. ఈ సందర్భంగా అధికారులకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- ఎస్.రాయవరం:మండలంలో సర్వసిద్ధి, పెనుగొలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా మాసోత్సవాలు పురస్కరించుకొని అవగాహన శిబిరాలు, ర్యాలీలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ ఎన్.వాసంతి తెలిపారు. సర్వసిద్ధి పీ.హెచ్.సి వద్ద ఆరోగ్య విస్తరణ అధికారులు తంతపురెడ్డి నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ, పి హెచ్ ఎన్ఎం రత్న సఖి, మలేరియా ఇంఛార్జి నోడల్ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పెనుగోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిమ్మాపురం 2లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మలేరియా మాసోత్సవాలు చేపట్టారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య అధికారి జమీమా రాణి మాట్లాడుతూ, ప్రతి పౌరుడు మలేరియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

నిర్మానుష్యంగా ఉన్న కేడీ పేట రోడ్డు

ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

- ఉక్కపోతతో అవస్థలు

ప్రజాశక్తి-గొలుగొండ:వేసవి కాలం చివరి దశకు చేరుతున్నప్పటికీ ఎండలు మాత్రం తన ప్రతాపాన్ని చూపుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. దీంతో, జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వడగాడ్పులు విపరీతంగా వీస్తున్నాయి. ఈ సమయంలో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. శుక్రవారం గొలుగొండ, చీడిగుమ్మల, జోగుంపేట, ఏఎల్‌పురం, పాత కేడీపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే కేడీపేట మెయిన్ రోడ్డు కూడా బోసిపోయింది.

గ్రంథాలయాల్లో పలు అంశాలపై..

విద్యార్థులకు అవగాహన

గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరములో భాగంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకరరావు ఐకమత్యమే మహాబలం కథా సారాంశాన్ని విద్యార్థులకు వివరించారు. ఐకమత్యముతో ఎలా మెలగాలో ఆటల రూపంలో తెలిపారు. సిహెచ్ భవాని టీచర్ స్పోకెన్ ఇంగ్లీష్‌ను వివరించారు. గ్రంథాలయాధికారిని దమయంతి మాట్లాడుతూ, ప్రతి ఆదివారం జరిగే చిల్డ్రన్స్ క్లబ్ లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

గొలుగొండ:వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని కలగజేసే విధంగా కార్యక్రమాలు చేశారు. మతసామరస్యం సమానత్వం అనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా మ్యాజిక్ కూడా చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు త్రిమూర్తులు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం లైబ్రేరియన్ బి. సూర్యకళ ఆధ్వర్యంలో విద్యార్థులకు కూచిపూడి నృత్యకళాకారిణి శర్వాణి కూచిపూడి నృత్యంపై శిక్షణ ఇచ్చారు. ముందుగా విద్యార్థులతో కథలు చదివించడం, రాయించడం, చెప్పడం చేయించారు.రిసోర్స్ పర్సన్ జబీనా యాస్మిన్, మౌనిక, బిఎస్‌సి విద్యార్థి శ్యామ్ పాల్గొని చిన్నారులకు పలు సూచనలు చేశారు.

ములగాడ : మనిషి జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలలో పుస్తకాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం అన్నారు. మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో చిన్నారుల వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పుస్తకపఠనం మనిషిలో మంచి మార్పును తెస్తుందన్నారు. రచయిత కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి. అజయ్‌కుమార్ పాల్గొన్నారు. చిన్నారులు బృంద గానాలతో, దేశభక్తి గీతాలాపన, ఆటలతో సందడి చేశారు.

మునగపాక రూరల్:వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ఉపాధ్యాయులు కిల్లాడ ప్రసాద్ భారతదేశ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు బోధించారు. భారతీయ సంస్కృతి ఈరోజు ప్రపంచమంతటికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమార్తెకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఎపిఆర్ఎస్‌కు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మాడుగుల:ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ (ఏపీఆర్ఎస్)కు మాడుగుల కోచింగ్ సెంటర్ విద్యార్థిని దేవరపల్లి ఉనైస ఎంపిక అయ్యింది. గత నెల 20న ప్రవేశ పరీక్షలు జరగగా శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. ఈ బాలిక భీమిలి ఏపిఆర్ఎస్‌కు ఎంపిక అయ్యింది. సిబిఎస్సి సిలబస్‌తో ఉన్నతమైన విద్యతో పాటు ఉచిత వసతి సౌకర్యాలు అందుబాటులో వుంటాయి. బాలిక తల్లిదండ్రులు దేవరపల్లి రామకృష్ణ, రూప వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాళపు రెడ్డి నాగచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన స్పందన ఫిర్యాదులను అధికారులు పరిష్కార మార్గం చూపుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం తహసిల్దార్ జానకమ్మ, మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ, మండల స్థాయి అధికారుల సమక్షంలో పలు సమస్యలు పరిష్కరించారు. ప్రధానంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి సుంకపూరు నుంచి 3, చౌడువాడ 2, చిన్నబొడ్డేపల్లి 1 ఫిర్యాదులు అందగా వీటిలో నాలుగు పరిష్కరించినట్లు తెలిపారు.గొట్టువాడ గ్రామానికి సంబంధించి స్థల వివాదం పరిష్కారానికి ఇరువర్గాల ఫిర్యాదుదారులను పిలిచి వారి వాదనలు విన్నారు. కైలాసపట్నం గ్రామానికి సంబంధించి రైతులకు అంతర్ జిల్లా నుంచి వచ్చిన వ్యాపారులు నకిలీ మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి మోసం చేశారని ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికార వ్యవస్థ నిద్దర పోతోందని, ఆరు రోజులుగా నీటి సరఫరా లేకపోతే ఎలా ఉంటామన్న ధ్యాస కూడా లేకుండా వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రోలుగుంట మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న 11 గ్రామాల్లో సుమారు 10వేల మంది జనాభా ఉంటున్నారని, ఆయా ప్రాంతాల్ని ప్రభుత్వమే ఫ్లోరైడ్ గ్రామాలుగా గుర్తించిందన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నీటి సరఫరా చేస్తున్న పైప్‌లైన్ బీఎన్ రోడ్డు కల్వర్టు మరమ్మతుల పేరిట కాలయాపన జరుగు తోందన్నారు. జానకిరాంపురం నుంచి రోలుగుంట పంప్ హౌస్‌కు వెళ్తున్న 120 అడుగుల పైప్‌లైన్ పనుల్లో భాగంగా ధ్వంసమైందన్నారు. ఆరు రోజులవుతున్నా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు పట్టించు కోలేదన్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ వాటర్‌ప్లాంట్లనే ఆశ్రయిస్తున్నారని, దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తక్షణమే మంచి నీటి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న గోవిందరావు

నేడు జనసేన సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం ఎన్జీఓ హోమ్‌లో ఈ నెల 10న జనసేన పార్టీ నియోజకవర్గ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు గండెం దొరబాబు తెలిపారు. పవన్ కళ్యాణ్ వరాహి యాత్రపై సమావేశం జరుగుతుందన్నారు.పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ హాజరవుతారన్నారు.

అరకులోయలో ఉత్సాహంగా ముగిసిన

గిరిజన సంఘం మహాసభ

-స్ఫూర్తినింపిన నాయకుల ప్రసంగాలు

-కర్తవ్యాల అమలుకు సిద్ధమైన నూతన కార్యవర్గం

ఎన్నికైన నూతన రాష్ట్ర కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్:అరకులోయలో సున్నం రాజయ్య నగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న గిరిజన సంఘం ఎనిమిదో రాష్ట్ర మహాసభ శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. ఈ రెండు రోజులూ సాగిన నాయకుల ప్రసంగాలు ప్రతినిధుల్లో స్ఫూర్తినింపాయి. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఛైర్మన్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తొలిరోజు మహాసభల ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ దిశా నిర్దేశం చేశారు. రెండో రోజు ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గిరిజన సంఘం పోరాట ఫలితంగా వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు గిరిజన హక్కులు, చట్టాలపై దాడి తీవ్రమైందని అన్నారు. గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి ఆహ్వానించకుండా అవమానించడం దారుణమన్నారు. గిరిజన గ్రామాల్లో రక్షిత మంచినీరు నేటికీ లేదన్నారు. దీంతో ఆదివాసీలు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. రెండో రోజు సభలో అధివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఛైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అప్పలనర్స, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, మంతెన సీతారాం, పి.బాలదేవ్, ధర్మాన పడాల్ పాల్గొన్నారు.

అలరించిన ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు

అరకులోయ : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా మర్రి కామయ్య వేదికగా మూడు రోజులుపాటు నిర్వహించిన ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఏజెన్సీ ప్రాంత వాసులే కాకుండా పర్యాటకులూ వీటిని చూసేందుకు వేలాదిగా తరలివచ్చారు. 250 మంది కళాకారులు రాష్ట్ర నలుమూలల నుంచీ తరలివచ్చి తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రారంభ కార్యక్రమానికి మాజీ ఎంపీ పి.మధు హాజరవగా, ముగింపు కార్యక్రమానికి మిడియం బాబూరావు, తదితరులు హాజరై కళాకారులను, వీక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. సంబరాలు చివరి రోజైన గురువారం రాత్రి గిరిజన సంఘం నాయకులు బాబూరావు, సురేంద్ర, పి.అప్పలనర్స, రామారావు, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, గసభ సర్పంచ్ వి.సునీత, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు తిరుపతిరావు, తౌడన్న, గిరిజన సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు మంగరాజు తుడుము వాయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చొంపి గ్రామానికి చెందిన కళాకారులు మువ్వలా, కుంద ధింసా నృత్యాలతో ఆకట్టుకున్నారు. మారగడ గిరిజన వాయిద్యం, గుమ్మగూడ సంకిడి, రంపచోడవరం పప్పుల నృత్యం, కర్ర కోలాటం, పాటల నృత్యం, పద్మాపురం మోడల్ ధింసా, రామచందర్ విచిత్ర ప్రదర్శన, ఆదివాసీ బాలికల నృత్యం, చొంపి బల్లి నాటకం, సైలోరి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆదివాసీ సంస్కృతి సంబరాల కమిటీ ఛైర్మన్ టి.చిట్టిబాబు, జిల్లా నాయకులు రఘునాథ్, మహేష్, ఎరుకల దొర, ఎం.బాబూరావు, పి.దేముడు, కె.రామారావు, గిరిబాబు, బుజ్జిబాబు, రామన్న, జోషి, సురేష్, మల్లేష్, భగత్‌రామ్, సూర్యనారాయణ, నానిబాబు, మగ్గన్న, హరి పాల్గొన్నారు. సాంస్కృతిక కళా ప్రదర్శన బృందాలను పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజు బాబు, టిడిపి మండల అధ్యక్షులు శెట్టి బాబూరావు, యుటిఎఫ్ నాయకులు చిట్టిబాబు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు, తదితరులు అభినందించారు.

కొండెక్కిన కోడి

కిలో చికెన్ రూ.300

ప్రజాశక్తి-మాడుగుల:సామాన్యులకు అందుబాటు లో లేని విధంగా కోడి మాంసం ధరలు అమాంతంగా పెరిగాయి. చాలా కాలం తరువాత ఊహించని విధంగా కోడి ధర కొండెక్కింది. ప్రస్తుతం బ్రాయిలర్ కోడి మాంసం కిలో రూ.300 దాటింది. లైవ్ ధర రూ.175లకు చేరింది. చాలా కాలం తరువాత ఇంత భారీ స్థాయిలో ధరలు పెరగడం ఇదే మొదటిసారి. దీంతో, సామాన్యులు కోడి మాంసం తినే పరిస్థితి కరవు అయ్యింది. సుమారు ఐదు నెలల కిందట కోడి ధరలు అమాంతం పడిపోయాయి. 100 రూపాయల లోపే కిలో లైవ్ ధర వుండేది. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయి లబో దిబో మన్నారు. స్వంతంగా కోళ్లను పెంచి విక్రయించే రైతులు లక్షల్లో నష్ట పోయారు. కంపెనీల ద్వారా పౌల్ట్రీ లు నడిపే రైతులు సైతం రేట్ ఇన్సెంటివ్ లేక నష్ట పోవలసి వచ్చింది. అప్పట్లో పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. కార్తీక మాసంలో అనేక మంది నాన్ వెజ్ తినరు. ఆ సమయంలో కోడి మాంసం ధరలు కొంచం తక్కువగా వుండడం సహజం. కార్తీక మాసంలో వున్న ధరలు కంటె, ఆ తరువాత ధరలు ఇంకా తగ్గడం వెనుక పౌల్ట్రీ కార్పొరేట్ శక్తులు మాయాజాలమే అని పౌల్ట్రీ రైతులు అవేదన చెందారు. ప్రస్తుత ధరలు బట్టి రైతులకు మంచి లాభాలు రావడం సహజమే అయినా, ఇంత భారీ స్థాయిలో కోడి ధర పెరగడం అనూహ్య మే. పెరిగిన భారీ ధరలతో సామాన్యులకు ఆర్థిక భారం తప్పదు. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో నాన్ వెజ్ ఏర్పాటు చేసేవారికి మాత్రం అదనపు భారం తప్పదు.

మాట్లాడుతున్న ఎస్ఐ

మత్తు పదార్థాలతో అనర్థాలు

ఎస్ఐ విభూషణరావు

ప్రజాశక్తి-కొత్తకోట:కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని దొండపూడి గ్రామంలో విలేజ్ లెవెల్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట ఎస్సై విభూషణరావు మాట్లాడుతూ, గంజాయి, నాటు సారా, వంటి మత్తు పదార్ధాలు సేవించడంతో వచ్చే దుష్పరిణామాలపై యువతకు వివరించారు. గ్రామాలలో నేరాలు పాల్పడకుండా సమన్వయం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: గృహ నిర్మాణాల వేగ వంతానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ సూచించారు. శుక్రవారం కోటవురట్ల మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వద్ద నిర్మిస్తున్న కాలనీ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందజేయడంతో పాటు మెటీరియల్ సమకూర్చాలని ఆమె తెలిపారు. విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం అధికారులతో మండల పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏఓ చంద్రశేఖర్, సర్పంచ్ అనిల్ కుమార్, ఈఓపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు, సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మాడుగుల: మండల కేంద్రంలోని జగనన్న లే అవుట్ వద్ద శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. రామచంద్రపురం వద్ద రెండు లే అవుట్‌ల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే దాదాపు ఇళ్ళు పూర్తికాగా, మిగిలినవి సైతం పూర్తి చేయమని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మీనా కుమారి, హౌసింగ్ ఏఇ లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

12న నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోట లో మెయిన్ రోడ్డు విస్తరణను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న సోమవారం స్థానిక శ్రీ శాంతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని అ యూనియన్ ప్రతి నిధులు బి. బుల్లిబాబు, టి. శేఖర్ తదితరులు కోరారు. ఈ మేరకు స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ, అన్ని గ్రామాలలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా కొత్తకోటలో అధికారులు చేస్తున్న సర్వేపై పలు అనుమానాలకు తా వి స్తోందన్నారు. భవిష్యత్ తరాలకు రోడ్డు విస్తరణ చాలా అవసరం అయినప్పటికీ ఆక్రమణ దారులు అడ్డ దారులలో అధికారులను మభ్య పెట్టి విస్తరణ కు మోకాలడ్డుతున్నారని తెలిపారు. ఈ నిరసనకు ఆటో యూనియన్, పలు ప్రజా సంఘాల, పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.